31-8-2000

# ఆర్థికసంఘం సిఫార్సులు అంత అన్యాయంగాలేవు

ఆర్థిక సంఘం (పదకొండవ ఫైనాన్స్ కమిషన్) సూచనల గురించి చంద్రబాబు చేస్తున్న గొడవ ఉచితమా, అనుచితమా అనేది సాధారణ దినపత్రికల పాఠకులకు అర్థం కాకపోవచ్చు. కష్టపడి అభివృద్ధి సాధిస్తున్న రాష్ట్రాలను చిన్నచూపు చూసి, తమ నిర్లక్ష్యం కారణంగా వెనుకబడి ఉండిపోయిన రాష్ట్రాలకు ఎక్కువ వనరులు కట్టబెట్టడం ద్వారా వెనుకబడి ఉండిపోవడమే ఉత్తమం అన్న సందేశాన్ని పదకొండవ ఫైనాన్స్ కమిషన్ ఇచ్చిందని చంద్రబాబు ఆరోపణ.

ఈ రకమైన వాదన కొత్తది కాదు. చవక బియ్యం కూలివాళ్ళలో సోమరితనాన్ని పెంచుతుందనీ, నిరుద్యోగ భృతి బేవార్సు బతుకులను ప్రోత్సహిస్తుందనీ తరచుగా వింటుంటాం. అయ్యో పాపం అంటూ వెనుకబాటుతనానికి రాయితీలు ఇస్తుంటే, అదే బాగుందని జనం అక్కడే ఉండిపోతారని ఈ రకమైన వాదన వినిపించే వాళ్ళ ఉద్దేశం.

సంక్షేమ వ్యవస్థ కొంతమంది మీద ఈ రకమైన ప్రభావం వేస్తుందని ఒప్పుకోవచ్చు. కానీ మెజారిటీ ప్రజలకు ఇది వర్తిస్తుందని నమ్మడానికి ఆధారమేమీ లేకున్నప్పటికీ ఈ రకమైన వ్యాఖ్యల ప్రాచుర్యానికేమీ లోటు లేదు. భూ సంస్కరణలను వ్యతిరేకించే వాళ్ళు, చవక డిపోలను వ్యతిరేకించే వాళ్ళు, ఉద్యోగ భద్రతను వ్యతిరేకించే వాళ్ళు, సబ్సిడీలను వ్యతిరేకించే వాళ్ళు —వీరి నోట ఈ వాదన తరచు వింటుంటాం. చంద్రబాబు ఈ వాదననిప్పుడు కేంద్ర, రాష్ట్ర ఆర్థిక సంబంధాలకు కూడా వర్తింపజేస్తున్నారు.


మన రాజ్యాంగం దేశ ఆర్థిక వనరులపైన అధికారాన్ని ప్రధానంగా కేంద్ర ప్రభుత్వం చేతిలో పెట్టింది. ప్రధానమైన పన్నులు కేంద్ర ప్రభుత్వం వసూలుచేసుకుంటోంది. అయితే ఆర్థిక వనరులలో కొంత భాగం రాష్ట్రాలకు ఇవ్వవలసి ఉంటుంది. ఎంత భాగం అనే విషయం నిర్ణయించడానికి ఒక ఫైనాన్స్ కమిషన్‌ను రాష్ట్రపతి (అంటే కేంద్ర ప్రభుత్వం) ఏర్పాటు చేస్తారు. ఈ కమిషన్ రాజ్యాంగంలోని ఆర్టికల్ 280 కింద ఏర్పడుతుంది.

ఇప్పటివరకు కేంద్రం సేకరించే వనరులలో రాష్ట్రాల వాటా ఎంత ఉండాలి అనే విషయంపైన ఫైనాన్స్ కమిషన్ల నిర్ణయాలపై చర్చ ప్రధానంగా జరిగేది. దేశ రాజకీయార్థిక వ్యవస్థలో 'ఫెడరలిజం' వర్ధిల్లాలని కోరుకునే పార్టీలన్నీ కూడా రాష్ట్రాలకు మరింత ఎక్కువ వనరులు ఇవ్వాలని డిమాండ్ చేసేవి. ఇప్పుడు మొట్టమొదటిసారిగా రాష్ట్రాల వాటా ఎంత అనే చర్చ వదిలిపెట్టి ఏ రాష్ట్రం వాటా ఎంత అనే అంశాన్ని చంద్రబాబు ముందుకు తీసుకొచ్చారు. 'అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాలు', 'వెనుకబడి ఉండిపోయిన రాష్ట్రాలు' అంటూ రాష్ట్రాలను రెండుగా వర్గీకరించి, ఇందులో మొదటి వర్గానికి చెందిన రాష్ట్రాలకు ఎక్కువ వనరులు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. చేతకానివాళ్ళు వెనుకబడి ఉంటారనీ, సమర్థులు అభివృద్ధి చెందుతారనీ, సామర్థ్యానికి పారితోషికంగా ఎక్కువ వనరులు వారి చేతిలో పెట్టాలనీ ఆయన సిద్ధాంతం. చేతకానితనమే వెనుకబాటుతనానికి కారణమా? సామర్థ్యం నుండే అభివృద్ధి వస్తుందా? అన్న ప్రశ్నలు వేసుకుంటే ఈ వాదన పునాదులు కదిలిపోతాయి. ఈ

> పదకొండవ ఫైనాన్స్ కమిషన్ ఆలోచనా ధోరణి సరళీకరణకు అనుకూలమైనదే. ఎటొచ్చీ వీటిని అర్థంచేసుకునేటప్పుడువివిధ రాష్ట్రాలలోనూ, ప్రాంతాలలోనూఉన్న భిన్న సమస్యలను లెక్కలోకి తీసుకోవడం అవసరమని కమిషన్ భావించింది.

ప్రశ్నలు వేసుకోకుండా ఆ అభిప్రాయాలను గుడ్డిగా నమ్ముతూ వాటి చుట్టూ ఆర్థిక సిద్ధాంతాలను తయారుచేసుకుంటే, సమాజంలో వర్గాల మధ్య అసమానతలు పెరిగినట్టే రాష్ట్రాల మధ్య కూడా అసమానతలు పెరుగుతాయి.

నిజానికి పదకొండవ ఫైనాన్స్ కమిషన్ చంద్రబాబు చెబుతున్నంత 'బాధ్యతారహితంగా' వ్యవహరించలేదు. . జనాభా ఎక్కువ ఉన్న రాష్ట్రాలకు ఎక్కువ వాటా




ఇచ్చిందనీ, అందువల్ల కుటుంబ నియంత్రణను ప్రజలకు అలవరచే ప్రయత్నం చేయని ప్రభుత్వాల అలసత్వానికి బహుమానం ఇచ్చినట్టయిందనీ చంద్రబాబు వాదిస్తున్నారు. జనాభా పెరుగుదల కేవలం ప్రభుత్వ అలసత్వం ఫలితం కాదనీ, దానికి అనేక సాంఘిక ఆర్థిక కారణాలున్నాయనీ గుర్తించినట్టయితే, ఆ సాంఘిక ఆర్థిక కారణాలను అధిగమించడానికి అవసరమైన చేయూత ఇవ్వవలసి ఉంటుందని గుర్తించగలుగుతాం. అయినా, చంద్రబాబు వంటి విమర్శకులను దృష్టిలో ఉంచుకునే కాబోలు పదకొండవ ఫైనాన్స్ కమిషన్ ప్రస్తుత జనాభా లెక్కలు తీసుకోకుండా 1971 జనాభా లెక్కలను ఆధారంగా తీసుకుంది. అప్పటికి జనాభా నియంత్రణను ఒక కార్యక్రమంగా చేపట్టిన రాష్ట్రమేదీ లేదు కాబట్టి ఈ ప్రమాణాన్ని ఎంచుకోవడంలో 'వివక్ష' ఏమీ లేదు.

తలసరి ఆదాయం తక్కువ ఉన్న రాష్ట్రాలకు పదకొండవ ఫైనాన్స్ కమిషన్ కేటాయింపులు ఎక్కువ ఇచ్చిందని మరొక అభియోగం. నిజానికి కేంద్రవనరుల కేటాయింపులో ఫైనాన్స్ కమిషన్లు ఈ ప్రమాణాన్ని ఎప్పుడూ లెక్కలోకి తీసుకుంటూనే ఉన్నాయిగానీ ఈ సారి (పదకొండవ ఫైనాన్స్ కమిషన్) దీని 'వెయిటేజ్'ను కొంచెం పెంచింది. ఇది తప్పనుకుంటే ఏం చేయాలి? ఇప్పటికే తలసరి ఆదాయం సాపేక్షంగా ఎక్కువ ఉన్న రాష్ట్రాలకే ఎక్కువ ఇవ్వాలా? ఇది రాష్ట్రాల మధ్య అసమానతలను పెంచదా? అభివృద్ధిలో ప్రాంతీయ సమతుల్యం ఉండాలన్నది ఒక హేతుబద్ధమైన, ప్రజాస్వామికమైన లక్ష్యం కాదా?

తలసరి ఆదాయం తక్కువ ఉండడానికి 'నిర్లక్ష్యం, అసమర్థత తప్ప వేరే కారణమేమీ లేదనుకుంటే ఇది అసమర్థతను ప్రోత్సహిస్తుందనుకోవచ్చు. కానీ ఉత్తరప్రదేశ్, ఒరిస్సా, బీహార్ వంటి రాష్ట్రాల పాలనలో అసమర్థత పాలు కొంచెం ఎక్కువే ఉన్నప్పటికీ అవి ఆర్థికంగా పురోగమించకపోవడానికి అదొక్కటే కారణం కాదు. పదకొండవ ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ ఖుస్రో గారు ఒక దినపత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో వేరే రెండు కారణాలను ప్రస్తావించారు. కొండల మధ్య ఉన్న హిమాచల్‌ప్రదేశ్ వంటి రాష్ట్రాలలోకి ప్రైవేట్ పెట్టుబడి వనరులు ఎక్కువ ప్రవహించేడం కష్టం కాబట్టి ప్రభుత్వ వనరులు సాపేక్షంగా ఎక్కువ ఇవ్వవలసి ఉంటుంది కదా అన్నారు. మిలిటెన్సీ ప్రభావం ఎక్కువ ఉన్న జమ్ము కాశ్మీర్, అస్సాం, నాగాలాండ్ వంటి రాష్ట్రాలలో కూడా ప్రైవేట్ కంపెనీలు పెట్టుబడి పెట్టడానికి వెనుకాడతాయని గుర్తుచేశారు. ఆయన చెప్పని మరొక కారణాన్ని కూడా ప్రస్తావించవచ్చు. ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, ఒరిస్సా, బీహార్, రాజస్థాన్ వంటి రాష్ట్రాలలో సాంఘిక అసమానతలు, అణచివేతల పాలు సాపేక్షంగా ఎక్కువే. ఆ రాష్ట్రాలు ఆర్థికంగా అభివృద్ధి చెందకపోవడానికి, చెందిన మేరకది పేదలకు దక్కకపోవడానికి ఇదొక ముఖ్య కారణం. తమ చేతులలో లేని నైసర్గిక, రాజకీయ సాంఘిక పరిస్థితులకు ప్రజలను బాధ్యులను చేసి శిక్షించవచ్చునా?

'సామర్థ్యానికి' గుర్తింపు ఇవ్వాలని చంద్రబాబు ప్రదర్శిస్తున్న ఆరాటానికి అర్థం తనూ, తన పాలనా చాలా సమర్థమైనవని చెప్పుకోవడం. కానీ రెండు విషయాలలో పదకొండవ ఫైనాన్స్ కమిషన్ 'సామర్థ్యానికి' ఇచ్చిన వెయిటేజ్‌ను చంద్రబాబు ప్రభుత్వం అందుకోలేకపోయింది. వీటిలో ముఖ్యమైనది పన్నుల సేకరణ. సమర్థవంతంగా పన్నులు వసూలుచేసే రాష్ట్రాలకు కేంద్ర వనరులలో కొంచెం ఎక్కువ వాటా ఇవ్వాలని ఫైనాన్స్ కమిషన్ ప్రతిపాదించింది. అయితే ఈ సామర్థ్యం మన రాష్ట్ర ప్రభుత్వంలో లోపించింది. కాబట్టి దీని వలన ప్రయోజనం పొందలేకపోయింది. దానికి ఎవరినో నిందించడం ఎందుకు? ఆదాయ వ్యయాల సమతుల్యాన్ని పాటించడంలో క్రమశిక్షణ గల ('ఫిస్కల్ డిసిప్లిన్' గల) రాష్ట్రాలకు కొంత వెయిటేజ్ ఇవ్వాలని కూడా పదకొండవ ఫైనాన్స్ కమిషన్ ప్రతిపాదించింది. అది కూడా చంద్రబాబు ప్రభుత్వం అందుకోలేకపోయింది.

నిజానికి పదకొండవ ఫైనాన్స్ కమిషన్ ఆలోచనా ధోరణి సరళీకరణకూ, ప్రపంచీకరణకు అనుకూలమైనదే. ఎటొచ్చీ వీటిని అర్థం చేసుకునేటప్పుడు వివిధ రాష్ట్రాలలోనూ, ప్రాంతాలలోనూ ఉన్న భిన్న సమస్యలను లెక్కలోకి తీసుకోవడం అవసరమని పదకొండవ ఫైనాన్స్ కమిషన్ భావించింది. ఆ మేరకు హేతుబద్ధంగా వ్యవహరించింది.

ఈ వివాదంలో యాభై ఏళ్ళుగా చర్చకు వస్తున్న ఒక విషయం ఈ సారి చర్చకే రాకుండా పోయింది. అదేమిటంటే కేంద్రం చేజిక్కించుకునే వనరులలో రాష్ట్రాలకు ఎంత దక్కాలన్న ప్రశ్న. 10వ ఫైనాన్స్ కమిషన్ 29 శాతం ఇస్తే, 11వ ఫైనాన్స్ కమిషన్ దానిని 29.5 శాతానికి మాత్రం పెంచింది. అది అంత తక్కువ ఎందుకుండాలన్న చర్చ చేస్తే, దాని గురించి గొడవ పెట్టుకుంటే, అన్ని రాష్ట్రాలకూ, 'ఫెడరలిజం' మూల సూత్రాలకూ మేలు జరిగేది కాదా?

— కె. బాలగోపాల్